

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు శాఖలో పనిచేసే సిబ్బంది సమస్యలను సత్వరం పరిష్కరించి వారి న్యాయమైన కోర్కెలు తీర్చేందుకే పోలీసు వెల్ఫేర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఎస్‌పి మేరీప్రశాంతి తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మేరీప్రశాంతి ఆధ్వర్యంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది తమ సమస్యలను ఎస్‌పికి విన్నవించారు. సమస్యలు తెలుసుకున్న ఆమె వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు సిబ్బంది తమ సమస్యలను నేరుగా తనకు తెలిపేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు పోలీసు వెల్ఫేర్ డే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమస్యలున్న ప్రతిఒక్కరితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించానని చెప్పారు.

ఇసుక కొరతతో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయి. ఇల్లు గడవక పస్తులతో రోజులు గడుపుతున్న దుస్థితి నెలకొంది. మూడు నెలలుగా నరకయాతన అనుభవిస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లలకు స్కూల్ ఫీజులు చెల్లించలేక నలిగిపోతున్నారు. ఇసుకపై పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. సమస్య ఎప్పటికీ పరిష్కారమయ్యేనో తెలీక రోజులు వెళ్లదీస్తున్న పరిస్థితి నెలకొంది.



ఇసుక లేక.. ఇల్లు గడవక..!

పనుల్లేక భవన నిర్మాణ కార్మికుల పస్తులు

మూడు నెలలుగా ఇసుక కొరతతో ఇంటి దగ్గరే

36 రకాల నిర్మాణ కార్మికులపై తీవ్ర ప్రభావం

రెండు జిల్లాల్లోనూ మూడు లక్షల కుటుంబాలకుపైగా అవస్థలు

ఇంటి అద్దెలు కట్టలేక నరకయాతన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. నిర్మాణ రంగంలో దాదాపు 35 రకాల పనులు చేసేవారున్నారు. బోర్లు తీసేవారు, రాడ్ బెండింగ్, తాపీ పని, సెంట్రింగ్, ప్లంబింగ్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్లు, మార్బుల్స్ అతికేవారు, ఇటుక బట్టీల్లో పని చేసేవారు, కాంక్రీట్ మిల్లర్లు, భవన నిర్మాణ కార్మికులు ఇలా 36 రకాల పనులు చేసే వారుంటారు. వీరంతా రోజువారీ పనులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తుంటారు. తాపీ మేస్త్రీకి రూ.900, పనిచేసే కార్మికులకు రూ.600 వరకూ కూలి ఉంటుంది. నెలంతా పని చేస్తేనే వీరికి ఇల్లు గడుస్తోంది. ఇసుక సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడంతో గడిచిన మూడు నెలలుగా నిర్మాణ రంగం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పనుల్లేక కార్మికులు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. ఆదాయం లేకపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబాలు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు కొనసాగుతున్నా ధరలు చూస్తే గుండె గుభేలుమంటుంది. మూడు నెలల క్రితం వరకూ పది చక్రాల లారీ ఇసుక రూ.18 వేల నుంచి రూ.20 వేలు వరకూ ఉండేది. ఇప్పుడు రూ.30 వేల నుంచి రూ.32 వేల వరకూ ధర పలుకుతోంది. మొన్నటి వరకూ టన్ను ఇసుక రూ.750 ఉండగా ప్రస్తుతం రూ.1400 వరకూ పలుకుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.1200 ఉండేది కాస్తా రూ.ఆరు వేలకు చేరింది. బ్లాక్‌మార్కెట్లో ఇసుక కొనుగోలు చేయాలంటే చుక్కలు కన్పిస్తున్నాయి. దీంతో నిర్మాణ రంగం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వైసిపి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఉచిత ఇసుక పాలసీని రద్దు చేసి కొత్త పాలసీ ప్రకటించడంలోనూ జాప్యం చేయడంతో భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులు నెలలు తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దఎత్తున ఉపాధి పొందే రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణ కార్మికుల పట్ల ప్రభుత్వం అత్యంత ఘోరంగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. లక్షల కుటుంబాలు ఉపాధి లేక అల్లాడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకుండా పోయింది. పిల్లలకు ఫీజులు కట్టలేక, ఇల్లు గడవక అప్పులు తెచ్చి కార్మికుల కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయి. ఇసుక సరఫరాలో ప్రభుత్వం ఆది నుంచి వివాదాస్పదంగానే వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొత్తగా ఉపాధి కల్పించకపోగా ఉన్న ఉపాధిని సైతం ప్రభుత్వం దెబ్బతీస్తుందనే చర్చ కార్మికుల్లో నడుస్తోంది. ప్రభుత్వం వెంటనే ఇసుక సరఫరాను వేగవంతం చేసి నిర్మాణరంగంలో పని చేసే కార్మికులను ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.

మూడు నెలలుగా పస్తులే

ఎర్రా రాంబాబు, బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

మూడు నెలలుగా ఇసుక సరఫరా లేకుండాపోయింది. దీంతో నిర్మాణ రంగంలో పని చేసే లక్షల కుటుంబాలకు పని లేకుండాపోయింది. నిర్మాణ రంగంలో దాదాపు 35 రకాల పనివారు ఉపాధి పొందుతున్నారు. పనులు లేకపోవడంతో కుటుంబాలు గడవడమే కష్టంగా మారింది. వెంటనే ఇసుక సరఫరా చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలి.

ఇంటి అద్దె కట్టలేని పరిస్థితి

అయినపల్లి చినమాధవ, మదర్ థెరిస్సా రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ వ్యవస్థాపకులు

ఇసుక లేక నిర్మాణరంగ కార్మికులకు పని లేకుండాపోయింది. మూడు నెలలుగా పని లేకపోవడంతో ఇంటి అద్దె సైతం కట్టలేని దుస్థితి నెలకొంది. లక్షల కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయి. ఇసుక సరఫరా చేసి కార్మికుల ఉపాధిని కాపాడాలి.

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని రోటరీ హాలు ప్రాంగణంలో సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, మంతెన సీతారాం మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో, ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు కొత్త పథకాల హామీలతో సిగ్గు లేకుండా ప్రజలను మోసం చేసేందుకు ప్రకటనలు, మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలన్నీ కార్పొరేట్ ప్రయివేటు సంస్థలకు తాకట్టు పెడుతుందని దేశం మొత్తాన్ని అంబానీ, ఆదానీలకు కట్టబెడుతోందని, 75 సంవత్సరాల దేశప్రజల సంపదను కారు చౌకగా అమ్మడానికి చూస్తుందని విమర్శించారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయని పేర్కొన్నారు. అలాగే సిఎం జగన్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు పోలవరానికి ప్యాకేజీ తీసుకొస్తానని హామీ ఇచ్చారని, కానీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా తిరిగి బిజెపి ప్రభుత్వానికి సిఎం జగన్ వత్తాసు పలుకుతున్నారని, వీరి అధికారం, స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్‌ను తాకట్టుపెట్టడం దుర్మార్గమన్నారు. చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర అభివద్ధి కోరుకుంటే బిజెపికి మద్దతు ఇవ్వడం ఆపి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలని, బిజెపిని ఎండకట్టాలని హితవు పలికారు. అందుకోసమే ఈనెల 28, 29, 30 తేదీల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఏలూరులో జరుగుతున్నాయని, ఈ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించి బిజెపిని ఒంటరిని చేసేందుకు ప్రజల్లోకి ముందుకెళ్తామని, అందుకోసం ప్రతిఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నాగమణి, పి.కిషోర్, ఆర్.లింగరాజు, కె.రాజు, జిల్లా కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, కె.శ్రీనివాస్, ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, టి.ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌రహిత సమాజం నిర్మించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలో కలెక్టర్, ఇతర అధికారులు, విద్యార్థులు

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ పిలుపు నిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్/హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వాలంటీర్లను, సర్ సిఆర్ రెడ్డి కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లు, వివిధ కళాశాలల ఎన్‌సిసి క్యాడెట్లను విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమాజహితం కోసం చేసే ఇలాంటి కార్యక్రమాల్లో యువత ప్రధానపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారిపై ఆదరణ చూపుతూ పూర్తిస్థాయి జీవితాన్ని అందించేలా కృషిచేయాలన్నారు. ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. హెచ్ఐవిని తొలిదశలోనే గుర్తించి పరీక్షలు చేయడం వల్ల విస్తరించేందుకు అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, డిఇఒ శ్యామ్ సుందర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి రాకాడ మణి, ఎయిడ్స్ నియంత్రణ అధికారి నాగేశ్వరరావు, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళా బృందం

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన

ముసునూరు: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో గౌరవ ఛైర్మన్, సిఇఒ ఆదేశాలప్రకారం నాబార్డ్ సౌజన్యంతో జరుగుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు లోపూడి సర్పంచి పేరం కృష్ణ తెలిపారు. శుక్రవారం లోపూడి సచివాలయంలో డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై బుర్రకథ రూపంలో సహకార కేంద్ర బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించారు. సహకార కేంద్రబ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలను వివరించారు. ప్రతిఒక్కరూ పొదుపు ఖాతా తెరవాలని, దానివల్ల అనేక లాభాలు పొందొచ్చన్నాఉ. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు, ఎటిఎం, రూపే డెబిట్ కార్డ్ వాడకం వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై కళాజాత బృందం ప్రచారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షులు బి.నరసింహారావు, పంచాయతీ సిబ్బంది, సహకార శాఖ బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ ఉద్యోగాల మెరిట్ లిస్ట్ విడుదల

ఏలూరు టౌన్: జాతీయ ఆరోగ్య మిషన్(ఎంహెచ్ఎం) స్కీములో ఎపివివిపి ఆసుపత్రుల్లో ఏడాది కాలానికి కాంట్రాక్టు విధానంలో ఖాళీగా ఉన్న లాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థుల ప్రావిజినల్ మెరిట్ లిస్ట్‌ను జిల్లా వెబ్ సైట్ https://westgodavari.ap.gov.in, ap.gov.inలో పొందుపరిచామని డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట తెలిపారు. ఈ లిస్ట్‌లో పేర్కొన్న వివరాల్లో అభ్యంతరాలుంటే వాటిని సరిచేసేందుకు సంబంధించిన అర్జీలను సంబంధిత పత్రాలతో ఈనెల రెండో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కార్యాలయ పనివేళల్లో మాత్రమే, ఏలూరులోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

వికలాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

ఆటల పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు



వికలాంగుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

వికలాంగుల సామర్థ్యాన్ని గుర్తించి ఉన్నతస్థాయిలో రాణించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఈనెల ఐదో తేదీన ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న వికలాంగుల ఆటల పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ పోటీల్లో పది వికలాంగుల సంక్షేమ పాఠశాలలతోపాటు 500 మంది దివ్యాంగులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగులను అన్నిరంగాల్లోనూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఒలింపిక్స్ మాదిరిగానే వికలాంగులకు నిర్వహించే పారా ఒలింపిక్స్‌లో పాల్గొనే దిశగా తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. నగరంలో కొన్నిగోడలపై పెయింటింగ్స్ వేస్తున్నారని, అదే మాదిరిగా ఇండోర్ స్టేడియం ప్రహరీ మీద కూడా జాతీయస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు క్రీడాకారులు, వికలాంగుల క్రీడాకారుల ఫొటోలతో పెయింటింగ్ వేయించాలని, ఇందుకు అవసరమైన నిధులు కూడా ఇస్తామని చెప్పారు. ఏలూరులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మూడు నెలల్లో భూమిని గుర్తించాలని ఏలూరు ఆర్‌డిఒను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. వేసవి కాలంలో ఇతరుల మాదిరి వికలాంగులకూ క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని అసోషియేషన్ నాయకులు కోరడంతో ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఎస్‌డిఒను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆడుదాం..ఆంధ్రా క్రీడోత్సవాలు సచివాలయస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. అయితే వికలాంగులు తమకు జిల్లాస్థాయిలో ఒకేచోట క్రీడోత్సవాల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల ఐదో తేదీన ఉమ్మడి పశ్చిమ జిల్లాకు సంబంధించి భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో ముగింపు ఉత్సవాలు ఉంటాయన్నారు. ఇక్కడ జరిగే క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచి బహుమతులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. అవయవ లోపాల గురించి అధైర్యపడాల్సిన అవసరం లేదని కొన్ని విషయాల్లో సకలాంగులకు మిన్నగాతమ ప్రతిభను చూపుతారన్నారు. ఈ సందర్భంగా క్రీడా పతాకాన్ని ఆయన ఆవిష్కరించి మూడు చక్రాల సైకిల్ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాకాడ మణి, జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్, క్రీడాభివృద్ధి సంస్థ చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, దళిత సంఘ నాయకులు ఎం.అజయ్‌బాబు, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు వీరభద్రరావు, ఇతర సంఘనాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇతర అధికారులు

జిల్లాలో 18 ఏళ్లు దాటిన యువతను గుర్తించి ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి శుక్రవారం ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించిన (డ్రాఫ్ట్ పబ్లికేషన్) రోజున పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ప్రత్యేకంగా 30 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న ఫారాలు, ఎస్-ఎస్ఆర్-2024 సమయంలో స్వీకరించిన ఫారాలు, అనోమలిస్ పెండింగ్, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పెండింగ్ ఉన్న రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఇ-రోల్‌పై రిపోర్ట్‌లు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ, పిఎస్ఇలు, డిఎస్ఇలు, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారుల నియామకం, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హత ఉన్న యువతను గుర్తించేందుకు జూనియర్, ఇతర కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఐసిడిఎస్ వద్ద ఉన్న డేటాను అనుసంధానం చేసుకుని ఓటుహక్కు అర్హత పొందుతున్న యువతను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఈనెల రెండు, మూడు తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం అన్ని పోలింగ్ స్టేషన్లలో నిర్వహించి అర్హులను నమోదు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు.

జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించేనాటికి 312 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ముసాయిదా జాబితా ప్రకటించిన అనంతరం అందిన 6,7,8 దరఖాస్తుల్లో చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం 45,042 దరఖాస్తుల్లో ఇంకా 12,150 పరిష్కరించాల్సి ఉందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన నాటికి 15,88,622 మంది ఓటర్లు నమోదై ఉండగా చేర్పులు, మార్పులు, తొలగింపులు తర్వాత గతనెల 30 నాటికి 15,96,711 మంది ఓటర్లు నమోదయ్యారని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి 16 మంది నోడల్ అధికారులను, 206 మంది సెక్టార్ అఫీసర్లు, 206 మంది సెక్టార్ పోలీస్ అధికారులను నియమించామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఇఆర్ఒలు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జెడ్‌పి సిఇఒ సుబ్బారావు, ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జివివి.సత్యనారాయణ, కె.బాబ్జి, గీతాంజలి, కలెక్టరేట్ పరిపాలనాధికారి బి.రమాదేవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, ఎఇఆర్ఒ బి.సోమశేఖర్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జెసి

స్పందన దరఖాస్తులు రీఓపెన్ కాకుండా నాణ్యమైన రీతిలో పరిష్కరించాలని జెసి బి.లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. ద్వారకాతిరుమలలోని కాపు కళ్యాణ మండపంలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు తలారి వెంకట్రావుతో కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ప్రజల నుండి అందే విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తరువాత, ప్రజలు సంతృప్తి చెందే రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కార విధానంపై ప్రజలు సంతృప్తి చెందని కారణంగా దరఖాస్తులు రీ ఓపెన్ అవుతున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ/వార్డ్ సచివాలయ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు ప్రజలు తెలియజేసిన సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, క్షేత్రస్థాయిలో విచారణ చేసి, దరఖాస్తులు ఎందుకు రీ ఓపెన్ అవుతున్నాయో కారణాలు తెలుసుకుని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై జిల్లాస్థాయిలో కూడా సమీక్షిస్తామని, స్పందన దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జెసి హెచ్చరించారు. ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, వాటిని అర్హులైన పేదలకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం ద్వారకాతిరుమల సర్పంచి కె.స్వర్ణలత తన దరఖాస్తులో ద్వారకాతిరుమలలో తాగునీటి పైపులైన్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొత్త తాగునీటి పైపులైన్లు వేయాలని, వీధి దీపాలు లేని కారణంగా ద్వారకాతిరుమలకు నడకదారిన వచ్చే యాత్రికులకు ఇబ్బంది ఉందని, లక్ష్మీపురం నుండి ద్వారకాతిరుమల వరక వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ అధికారులను జెసి ఆదేశించారు. ఇలా పలు సమస్యలపై అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు విజయరాజు, కె.రవికుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ, డ్వామా పీడీ రాము, పశు సంవర్ధక శాఖ జెడి నెహ్రూబాబు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య, తహశీల్దార్ సతీష్ పాల్గొన్నారు.

ఏలూరు కాలువకు మరమ్మతులు చేయరూ..!

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయ పరిధిలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా రబీలో పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందేలా ఏలూరు కాలువకు అవసరమైన మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు. కార్యాలయ పరిధిలో సుమారు 35 వేల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. అధికారిక లెక్కల మేరకు పదివేల ఎకరాల వరకూ వీటిలో ఆక్వాసాగు చేస్తున్నారు. అనధికారికంగా దీనికి రెట్టింపు విస్తీర్ణంలో ఆక్వా సాగు జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఇక సాగు కోసం కార్యాలయ పరిధిలో 400 క్యూసెక్కుల వరకూ నీరు విడుదల కావాల్సి ఉంది. దీనికి అదనంగా ఏలూరు కార్పొరేషన్‌కు తాగునీటి అవసరాల కోసం ప్రత్యేకంగా నీరు విడుదల చేయాలి. రబీసాగు సజావుగా జరగాలంటే గోదావరి జలాలకు తోడు సీలేరు నుంచి నీరు విడుదల కావాల్సి ఉంది. వ్యవసాయంతో పోల్చుకుంటే ఆక్వా సాగు కోసం మూడు రెట్ల నీటి పన్నును ప్రభుత్వం వసూలు చేస్తుంది.

దీనికోసం కొల్లేరు సరస్సులోని నీటిని మాత్రమే వాడుకోవాల్సి ఉంది. ప్రస్తుతం వివిధ కారణాలవల్ల కొల్లేరులో నీటి లభ్యత లేదు. ఫలితంగా సాధారణ సాగుతో పాటు ఆక్వా సాగుకు సైతం రైతులు గోదావరి జలాలపైనే ఆధారపడాల్సి ఉంది.

ఈ విషయాలను పక్కనపెడితే రైతులను రబీలో ఆదుకునేందుకు మురుగు కాలువలకు అడ్డుకట్టలు వేసి నీటిని నిలువ చేసి సరఫరా చేసేందుకు నీటిపారుదల శాఖ, డ్రెయినేజీ శాఖ కసరత్తు చేస్తున్నాయి. దీనికోసం బద్రికోడు, నాగులకోడు, దోసపాడు, కురెళ్లగూడెం సెవెన్ ఇన్ లెట్, వాలుకోడుతో పాటు మొండికోడు, నెంబర్ 2,6,7 అండర్ టన్నెల్, ఏడు ఎస్‌కెప్లో వద్ద అడ్డుకట్టల ఏర్పాట్లకు ప్రతిపాదించారు. దీనివల్ల 150 క్యూసెక్కుల వరకూ సాగునీరు అందుబాటులో ఉంటుందని అంచనావేశారు. కానీ గతంలో నీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టినప్పుడు పనుల బిల్లులు ఇప్పటికే విడుదల కాని నేపథ్యంలో వాటిని చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఇదేవిధంగా ఏలూరు కాలువ శివారులో పాలగూడెం వద్ద గోదావరి జలాలను ఇంజన్‌తో తరలించేందుకు అనుమతించే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఇక భీమడోలు నెంబర్ వన్ ఎస్కేప్ వద్ద ఏలూరు కాలువకు మరమ్మతుల కోసం రూ.పది లక్షలు, పోతునూరు ఛానల్ తూము పున:నిర్మాణానికి రూ.తొమ్మిది లక్షలు, నెంబర్ 2 ,3 ,4 ఎస్కేప్‌ల వద్ద మరమ్మతులకు రూ.20 లక్షలతో పనులు చేసేందుకు ప్రతిపాదించారు. ఇదేవిధంగా సాగునీరు సరఫరా సమయంలో కాలువ గట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో లీకేజీలను అరికట్టి ఇసుక బస్తాలను సిద్ధం చేసేందుకు నిధులు అవసరమవుతాయని ఇరిగేషన్ శాఖ ప్రతిపాదించింది. ఇక కాలువలో పెరిగిపోయిన తూడు, కర్రనాచు తొలగించాల్సి ఇవన్నీ పూర్తికాకుండా అవసరమైన నిధులు మంజూరు చేయకుండా రబీకి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అవసరమైన నిధులను మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ ముందస్తుగా రైతులను చైతన్యపరిచేందుకు బోర్ల కింద ఆరుతడి పంటలు వేసే విషయాన్ని పరిశీలించాలని కోరుతున్నారు.

బిసి బాలుర హాస్టల్లో విజిలెన్స్ తనిఖీలు

కామవరపుకోట: మండల కేంద్రమైన కామవరపుకోటలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ గురువారం రాత్రి పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆహార ధాన్యాల నిల్వ వివరాలు పరిశీలించారు. వంటశాలకు వెళ్లి ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించి ప్రభుత్వ నియమావళి ప్రకారం మెనూ అమలవుతోందో లేదో గమనించారు. విద్యార్థులు భోజనం చేసే వరకూ వారితోనే ఉండి ఆహారం రుచి, నాణ్యత, పరిమాణం, మెనూ అమలు, తాగునీటి సదుపాయం తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఉన్న సౌకర్యాలను, ప్రస్తుత పరిస్థితులను సిబ్బంది విజయకృష్ణకు వివరించారు. స్థానిక దాతలు విద్యార్థుల పట్ల కనబరుస్తున్న చొరవ, స్పందిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. విద్యార్థుల హాజరు, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. సరుకును తనిఖీ చేశారు. వసతి గృహం శుభ్రత విషయంలో శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు.

20 నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె బాట

జంగారెడ్డిగూడెం : ఈనెల 20వ తేదీ నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెబాట పడుతున్నట్లు ఎపి సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా కమిటీ తెలిపింది. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల కంప్యూటర్ ఆపరేటర్, ఎంఐఎస్, అకౌంటెంట్, సిఆర్‌పి, ఐఇఆర్‌టి, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్లు రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు సమ్మె చేపడుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఎంఇఒ బి.రాముడుకు శుక్రవారం సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 25 వేల మందికి మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నోటీసు అందజేసిన వారిలో కె.సువర్ణలత, బి.శ్రీలక్ష్మి, ఎల్‌వి.రవికిరణ్, పలువురు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు .

15వ తేదీ లోపు సభ్యత్వాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఈనెల 15వ తేదీ లోపు భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వాలు పూర్తి చెయ్యాలని సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు తెలిపారు. పి.రాఘవులు అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నుంచి ఇసుక బ్యాన్ చేశారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిసెంబర్ 4న కొయ్యలగూడెం ఎంఆర్ఒ ఆఫీసు ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోచదువుల నాగు, షేక్ చిన్న రమణ, కె.పెద్దిరాజు, ఎమ్.పేర్రాజు, మట్ట అప్పారావు, వినేశ్వరారవు పాల్గొన్నారు.

ప్రథమ మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

డిసెంబర్ 9, 10 తేదీల్లో ఏలూరులో జరిగే ఎఐటియుసి జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి చింతలపూడి ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు తొర్లపాటి బాబు, కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. పట్టణంలో ఎఐటియుసి ఏరియా సమితి సమావేశం తొర్లపాటి బాబు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ కార్మికుల శ్రమ, శక్తి, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి అనేక చట్టాలను సాధించడంలో ఎఐటియుసి ప్రముఖ పాత్ర వహించిందన్నారు. అనంతరం ఎఐటియుసి జిల్లా ప్రథమ మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు కంచర్ల గురవయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చేపల్లి శ్రీనివాసరావు, ముఠా కార్మికులు రాంప్రసాద్, వీరబాబు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెండు సంవత్సరాలకు ఒకసారి ఏలూరు బస్టాండ్ ఇన్సైడ్ ఫ్రెండ్స్ ఆటో ఓనర్స్, డ్రైవర్స్ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ ఎన్నిక జరుగుతుందని, గత కమిటీ కాల పరిమితి నవంబర్ 30వ తేదీన ముగిసిన నేపథ్యంలో అధ్యక్ష ఎన్నిక బ్యాలెట్ ద్వారా అత్యధిక ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్ నిర్వహించడం జరిగిందని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు తెలిపారు. ఏలూరు కొత్త బస్టాండ్ ఇన్సైడ్ ఫ్రెండ్స్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ఎన్నికలు శుక్రవారం ఐఎఫ్‌టియు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐఎఫ్‌టియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ శివాపు శివప్రసాద్ ఈ ఎన్నికలో గెలుపొందారని తెలిపారు. ఎన్నిక నిర్వహణలో ఐఎఫ్‌టియు నగర అధ్యక్షులు కాకర్ల అప్పారావు, నాయకులు దుళ్ల వీరి నాయుడు, భద్రం, నూకరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముద్దరబోయిన

జగన్ పాలనలో ఇసుక దోపిడీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద టిడిపి శ్రేణులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్ర బోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని దోపిడీలతో పాటు ఇసుక దోపిడీ కూడా కొనసాగుతుందన్నారు. టిడిపి పాలనలో పేదలకు ఉచితంగా ఇసుక ఇచ్చినట్లు తెలిపారు. కాలనీ ఇళ్లకు ప్రభుత్వమే తక్షణం ఇసుక అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చిన్నం రామకోటయ్యకు కృతజ్ఞతలు'

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రతినెలా తనకు కావాల్సిన మందులను స్వయంగా ఇంటికి పంపిస్తానన్న నూజివీడు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్యకు కొమ్ము ఆనందం కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఫ్యాంక్రియాస్ వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్న తనకు నెలకు రూ.8 వేలు మందులకు ఖర్చు అవుతుందని ప్రభుత్వాన్ని సహాయం కోరగా ప్రభుత్వం సహకరించకపోవడంతో రామకోటయ్యను ఆశ్రయించగా ఆయన స్పందించి మందులు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారని ఆనందం తెలిపారు. దానిలో భాగంగా ఈనెల ఒకటో తేదీన ఆనందం గృహానికి మందులు పంపిణీ చేశారు. మాట ఇచ్చి నిలబెట్టుకుంటూ ప్రతినెల ఒకటవ తేదీన మందులు ఇంటికే పంపిస్తున్న చిన్నం రామకోటయ్యకు కొమ్ము ఆనందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దారా సుందర రావు, కొమ్ము సుజాన్ రావు, చిన్నంపేట మాజీ సర్పంచి డాక్టర్ బాబు పాల్గొన్నారు.

కోనేరు రంగారావు భూ సిఫార్సులు అమలు చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలో కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షులు టివిఎస్.రాజు డిమాండ్ చేశారు. కామవరపుకోట మండల కేంద్రంలో ఈనెల 4వ తేదీన జరిగే భూ పోరాట సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భూ పోరాట సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని బొర్రంపాలెం, మక్కినవారిగూడెం, మధ్యాహ్నపు వారి గూడెం, అప్పలరాజు గూడెం, బండివారి గూడెం, టి.నరసాపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. పేదలు అధిక సంఖ్యలో పాల్గొని భూ సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొండముచ్చు శ్రీనివాసరావు, కాళహస్తి సుబ్బారావు, మక్కిన పుల్లారావు, వల్లెం వెంకటేశ్వరరావు, కొప్పుల సతీష్, బయ్యగాని ఏకాంబరం పాల్గొన్నారు.

స్వామివారికి వెండి విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానమునకు శుక్రవారం దాత వెండి విరాళంగా అందించారు. కలిదిండి వాస్తవ్యులు వి.శ్రీధర్, కళ్యాణి దంపతులు స్వామివారి దేవస్థాన అంతరాలయ ముఖద్వారమునకు వెండి తాపడము చేయు నిమిత్తం 500 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజుకు అందజేశారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఇ.శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాన్‌బెయిలబుల్ వారంట్లపై కూడా వివరాలు సేకరించారు. వారంట్లను వెంటనే అమలు పరిచి సంబంధిత నేరస్తులను కోర్టులో హాజరు పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ సిఐ రాజశేఖర్, ఎస్ఐలు రామకృష్ణ, లక్ష్మణ్ బాబులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మైనర్ బాలికను వివాహం చేసుకున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని సత్యనారాయణ పురం గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ రమేష్ బాబును ఆయన అక్క చందోలు వీరమ్మ, శ్రీనివాసరావు, వదిన కొక్కిలిగడ్డ వనిత, వీరయ్యలను అరెస్టు చేసినట్లు ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మేజిస్ట్రేట్ వారి వద్దకు జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం పంపడం జరిగిందన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి, అపహరించి ఆపై వివాహం చేసుకున్నందుకు సదరు ముద్దాయిని, ఈ నేరం చేయుటకు ప్రేరేపించి సహరించిన రమేష్ బాబు కుటుంబ సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని డాక్టర్ ఎంఆర్.అప్పారావు కాలేజీలోని గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలని నినదించారు. ఈ సందర్భంగా పాఠశాల స్టాఫ్‌నర్స్ జ్ఞాన పుష్ప మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఎయిడ్స్ నివారణ పట్ల అవగాహన పెంపొందాలన్నారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు.


నూజివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భీమడోలు: ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత కోరారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం శాఖ కౌన్సిలర్ సిహెచ్.సింహాద్రి, ల్యాబ్ టెక్నీషియన్ డి.పాపారావుల ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. దీనిలో భాగంగా భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ వ్యాధి అనుమానితులు, వ్యాధిగ్రస్తులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తే సుమారు 6 వేల మంది వరకూ పాల్గొన్నారని తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా 120 మంది ఎయిడ్స్ రోగులకు ఏలూరులోని ఎఆర్‌టి కేంద్రం ద్వారా మందులు అందజేస్తున్నామని, పెన్షన్లు వారికి మంజూరయ్యాయని తెలిపారు. హెచ్ఐవి రోగులకు సాధారణ ప్రజానీకంతో సమానత్వం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ తరువాత సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది, భీమడోలు శ్రీవెంకటేశ్వర కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి క్యాడెట్ల భాగస్వామ్యంతో భీమడోలు పురవీధుల్లో నిర్వహించిన ర్యాలీని సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు ప్రారంభించారు. ఇదే క్రమంలో భీమడోలు రాష్ట్రీయ రహదారిపై మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్వేత, కళాశాల ప్రధానాచార్యులు బొమ్ము రవికుమార్ పాల్గొన్నారు.



ఏలూరు టౌన్‌లో..

కొయ్యలగూడెం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని బయ్యనగూడెం హాస్పిటల్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు డాక్టర్లు, వైద్య సిబ్బంది కలిసి అవగాహన కల్పించి అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఏలూరు టౌన్: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్, క్షయ నియంత్రణ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్‌తో కలిసి డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో ఎయిడ్స్‌ను నియంత్రించాలని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా ఎయిడ్స్, టిబి నియంత్రణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ అసమానతలను అంతం చేద్దాం.. ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ కోసం పాటుపడుతున్న పలు సంస్థల ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఎడి రాకాడ మణి, క్రీడాభివృద్ధి సంస్థ ఛీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, న్యాయ వాదులు కూన కృష్ణారావు, వెంకట్, పలు కళాశాలల ఎన్‌సిసి క్యాడెట్లు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, రెడ్ క్రాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



భీమడోలులో..


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

తహశీల్దార్ సుబ్బారావు

ప్రజాశక్తి - టి.నరసాపురం


మండలంలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తహశీల్దార్ జెవి.సుబ్బారావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెగా కంప్లీషన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2,135 ఇళ్లు మంజూరు కాగా 664 ఇళ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందని ఆయన తెలిపారు. నిర్మాణం చేపట్టిన ఇళ్లు రెండు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగా కుమారి, హౌసింగ్ ఎఆర్ జి.రాధాకృష్ణ, ఎపిఒ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న వైసిపి నేతలు

బాలుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు వేడి నీళ్లలో పడి గాయాలైన బాలుడిని శుక్రవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు పరామర్శించారు. అనంతరం పార్టీ నాయకులు బాలుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మొట్రూ ఏసుబాబు, జాస్తి చంటి, ఎంపిటిసి సభ్యులు, కోటే ప్రవీణ్, జి.రామారావు, పెయ్యేరు ఉప సర్పంచి దివి సతీష్, రంగిశెట్టి కొండ, రాచూరి కుమార్ పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉత్సాహభరితంగా సిఎస్‌టిఎస్ కళాశాల ఫ్రెషర్స్ డే

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక సిఎస్‌టిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకను విద్యార్థులు ఉత్సాహభరితంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాల ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలో కళాశాల నిర్వహణ కమిటీ అధ్యక్షులు, ప్రిన్సిపల్ ప్రసాద్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అనంతరం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో కళాశాల విద్యార్థులు ఆలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వహణ కమిటీ సభ్యులు పిపిఎన్.చంద్ర రావు, పరిమి సత్తిపండు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8వ తేదీ నుంచి వారు నిరవధిక సమ్మెకు పూనుకున్నారని, న్యాయబద్ధంగా జరుగుతున్న ఈ సమ్మెకు అంగన్‌వాడీ సెంటర్ల లబ్ధిదారులు, ప్రజలు, రాజకీయ పక్షాల ప్రతినిధులు, ప్రజా సంఘాలు మద్దతు తెలియజేయాలని సిఐటియు ప్రాజెక్ట్ కార్యదర్శి టి.మాణిక్యం విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ప్రజాసంఘల కార్యాలయంలో శుక్రవారం సిఐటియు మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్‌ను ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి దూరం చేస్తుందని, లబ్ధిదారులకు అందించాల్సిన నాణ్యమైన ఆహారంలో కోత విధిస్తుందని తెలిపారు. యాప్‌ల ద్వారా అంగన్‌వాడీలకు నిద్ర లేకుండా చేస్తున్నారని, రిటైర్డ్ అయిన అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వమని కోర్టు తీర్పు చెప్పినా గ్రాడ్యుటీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ సౌకర్యం లేదని, తెలంగాణ కంటే అధిక వేతనం ఇస్తామని జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నాలుగు సంవత్సరాలు దాటినా నేటి వరకూ ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న సమ్మెకు అందరూ మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరావు, సిఐటియు మండల కార్యదర్శి ఎం.బాలరాజు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్.సువర్ణరాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ

ప్రజాశక్తి - పెదవేగి

అర్హులైన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేయించుకుని, ఎన్నికల్లో వారు ఓటు హక్కును వినియోగించుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు పెదవేగి మండలంలోపి ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దెందులూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన యువకులు ఫామ్ సిక్స్ పూర్తి చేసి వారి సమీపంలోని పోలింగ్ స్టేషన్‌లో బిఎల్ఒకి గాని, సచివాలయం వద్ద గాని ఇస్తే వారు పరిశీలించి ఓటు హక్కు కల్పిస్తారన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి యువకులతో ర్యాలీగా వెళుతూ ఓటుహక్కు గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజ్ మనోజ్, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెదవేగిలో మాట్లాడుతున్న సత్యనారాయణ


ముసునూరు: మండలంలోని 16 గ్రామాల్లో నూతన ఓటర్ల చేర్పులు, మార్పులు చేసుకునే అవకాశం వినియోగించుకోవాలని ముసునూరు మండల రెవెన్యూ తహశీల్దార్ దాసరి సుధ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం కమిషన్ వారి ఆదేశాలనుసారం ఈనెల 2, 3 తేదీల్లో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటర్లను చేర్చుకోవడం, పాత ఓట్లు తొలగింపుల అర్జిలు స్వీకరించబడతాయని తెలియజేశారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ముదినేపల్లి

సామాజిక న్యాయం జరగాలన్నా, ప్రజలకు సంక్షేమం అందాలన్నా జగనన్నను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కోరారు. మండలంలోని పెయ్యేరులో శుక్రవారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి అల్లు సుశీల అధ్యక్షతన జరిగిన సభలో డిఎన్ఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు చేసిన అన్యాయాన్ని తెలుసుకొని వారికి న్యాయం చేయాలన్నా ఒక్క జగన్‌తోనే సాధ్యం అని ఈ ఐదేళ్లలో తేలిందన్నారు. చంటి పిల్లలు మొదలుకొని మహిళలు, వికలాంగులు, వృద్ధుల వరకూ అందరికి ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన జగనన్న వల్ల మన రాష్ట్రం మెరుగైన బాటలో నడుస్తుందన్నారు. ఈ అభివృద్ధి బాట కొనసాగాలన్నా, మనకు సంక్షేమం అందాలన్నా మన ఆంధ్రప్రదేశ్‌కి జగనే మళ్లీ సిఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, కోమటి విష్ణువర్ధన్, వైస్ ఎంపిపి చొప్పర్ల సునీత, మండల పార్టీ అధ్యక్షులు ఏసుబాబు, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎడి పోసరావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తుఫాను ప్రభావంపై రైతులు అప్రమత్తంగా వుండాలని మండల వ్యవసాయాధికారి కెవిఎన్.పోసరావు సూచించారు. శుక్రవారం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో లక్కవరం గ్రామంలో గ్రామ సర్పంచి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన అవగాహనా సదస్సులో పోసరావు మాట్లాడుతూ సార్వా సీజన్‌లో మండలంలోని 11,410 ఎకరాల వరి సాగు ఉందని, దీనిలో 5 వేల ఎకరాలు ఇప్పటి వరకు కోతలు కోసి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రాబోయే 3-4 రోజుల్లో తుఫాన్ ప్రభావం ఉంటుంది కాబట్టి రైతులందరూ కోసిన ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం నిబంధనలు ప్రకారం ఎవరైతే ధాన్యం తేమశాతం సరైనదిగా ఉన్నదో వారు వెంటనే రైతు భరోసా కేంద్రాల వారిని సంప్రదించి రైస్ మిల్లులకు పంపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జి.వెంకటరమణ, ఉప సర్పంచి నిమ్మ రామకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ బడి దుర్గారావు, దల్లి నాగేశ్వరావు, నిమ్మ గుర్నాథరావు, చల్లా దుర్గారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే ఎస్‌సి, ఎస్‌టిలపై కపట ప్రేమ

ప్రజాశక్తి - కలిదిండి

రాజకీయ లబ్ధికోసమే వైసిపి నాయకులు ఎస్‌సి, ఎస్‌టిలపై కపట ప్రేమ చూపుతున్నారని సర్పంచి బట్టు లీలా కనక దుర్గ ఆరోపించారు. మండలంలోని కోరుకొల్లులో ఆమె మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్లగా పట్టించుకోని వైసిపి పాలకులు ఎన్నికలు సమీపిస్తున్నందున కొండదొరలు, యానాదుల జీవన స్థితగతులు గుర్తుకువచ్చాయని, వారికి ఇళ్ల పట్టాలు ఇస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు క్షేత్ర స్థాయి పరిశీలనకు తనను తీసుకు వెళ్లకుండా, వైసిపి నాయకులు మాత్రమే వెళ్లడం వారి కుతంత్రాలకు అద్దం పడుతోందన్నారు. తాను ఎస్‌సి మహిళా సర్పంచిని కావడంతో పాటు జనసేన, టిడిపి మద్దతుతో గెలవడంతో వైసిపి నాయకులు రాజకీయ వివక్ష చూపుతున్నారన్నారు. గ్రామంలో మంచినీటి చెరువు పక్కనే అక్రమ చేపల చెరువు తవ్వుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆదే అక్రమ చేపల చెరువుకు మంచినీటి చెరువులోని నీటిని రాత్రిపూట తోడేసారని అధికారులకు చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. గ్రామాభివృద్ధిపై వైసిపి నాయకులకు చిత్తశుద్ధి లేదన్నారు. ఎన్నికల ముందు వారు చెప్పే కల్లబొల్లి మాటలు వినే స్థితిలో ఎవరూ లేరని సర్పంచి అన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల ఉన్నతి కాంక్షించే వారైతే అభివృద్ధికి సహకరిస్తూ వారి చిత్తశుద్ధి చాటుకోవాలని తెలిపారు.

ఆత్మహత్య చేసుకుంటానని వ్యక్తి హల్‌చల్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తాను చనిపోతానని, జీవితంపై విరక్తి చెందానని ఓ వ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కి బెదిరింపులకు పాల్పడటంతో అక్కడ స్థానికంగా కలకలం చోటుచేసుకుంది. ఐదు గంటల పాటు ఈ తంతు జరిగింది. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి అతన్ని కిందకు దించటంతో కథ సుఖాంతమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు మండలం వెంకటాపురంకు చెందిన దుర్గారావు లారీ క్లీనరుగా పనిచేస్తుంటాడు. అతను శుక్రవారం ఉదయం స్థానిక వన్‌టౌన్ వంగాయగూడెం సమీపంలోని జర్నలిస్టు కాలనీ దగ్గర ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందితో అక్కడకు వచ్చి, అతనితో మాట్లాడి కిందకు దించారు. దుర్గారావును స్టేషన్‌కు తీసుకువెళ్లిన పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.